25-06-2026

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 171



## వరంగల్ రెవెన్యూలో బిగ్గెస్ట్ స్కామ్

- వరంగల్ రెవెన్యూ అధికారి భూ అక్రమాలపై అడిషనల్ కలెక్టర్ ఎంక్వైరీ
- ముగ్గురు అధికారులు రిజెక్ట్ చేసిన 7.01 ఎకరాల ల్యాండ్‌కు అర్ధరాత్రి ఓకే
- ఓనర్ లేకపోవడంతో 22 మంది ఫేక్ పత్రాలతో 8 మందికి సేల్ డీడ్
- రూల్స్ మార్చి ఆర్ఐ, తహసీల్దార్, ఆర్‌డీఓలు కలిసి పాస్ బుక్స్ జారీ
- తిమ్మాపూర్ సీలింగ్ భూముల అక్రమ మ్యుటేషన్ మెయిన్ ఫైల్ గాయబ్
- స్టాఫ్‌ను విడివిడిగా విచారించి రాతపూర్వక స్టేట్‌మెంట్లు తీసుకున్న కలెక్టర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఖిలా వరంగల్ రెవెన్యూ శాఖ పరిధిలో ఒక ఉన్నతాధికారి చుట్టూ భూ అక్రమాల ఆరోపణల పరంపర తీవ్ర కలకలం సృష్టిస్తోంది. సదరు అధికారి అడుగు పెట్టిన ప్రతి చోటా భూముల వివాదాలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. గతంలో ఈయన విధులు నిర్వహించిన ప్రాంతాల్లో సైతం అనేక వివాదాస్పద భూ లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా తిమ్మాపూర్ పరిధిలోని విలువైన సీలింగ్ భూముల మిగతా 3లో..



## రూ.1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

- ఖానామెట్‌లో ఆక్రమించిన 5 ఎకరాల ప్రభుత్వ స్థలం రక్షణ
- ఐటీ కారిడార్‌లోని ఈ ల్యాండ్ రేటు రూ.1,000 కోట్లు
- ఫేక్ డాక్యుమెంట్లతో రాత్రికి రాత్రే అక్రమ షెడ్లు, ఫెన్సింగ్
- పోలీసు బందోబస్తుతో జేసీబీలతో కట్టడాలు నేలమట్టం
- స్థలం చుట్టూ ముళ్లతీగలు, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు
- కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలేదే లేదని హైడ్రా హెచ్చరిక

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాలైన హైటెక్స్ సమీపంలో ప్రభుత్వ భూములను అక్రమంగా హస్తగతం చేసుకున్న కబ్జాదారులపై తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక నిఘా విభాగం హైడ్రా బుధవారం నాడు తీవ్రమైన చర్యలు తీసుకుంది. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న భూ ఆక్రమణలపై వచ్చిన పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు ఖానామెట్ రెవెన్యూ పరిధిలోని అత్యంత విలువైన భూములను స్వాధీనం చేసుకునేందుకు ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసుకుని క్షేత్రస్థాయికి చేరుకున్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలో ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం ఈ తరహా పెద్ద ఆపరేషన్ నిర్వహించడం ఐటీ జోన్ వ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. కబ్జాదారుల ఆటలు సాగనివ్వబోమని ప్రభుత్వం ఈ చర్య ద్వారా స్పష్టం చేసింది. ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్ 42 పరిధిలో మిగతా 3లో..

# పాలమూరులో బ్రహ్మోస్ క్షిపణుల తయారీ?




- మహబూబ్‌నగర్‌లో 416 ఎకరాల్లో బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రం ప్రతిపాదన
- NH-44 హైవే, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు అత్యంత సమీపంలో స్థలం గుర్తింపు
- ప్రారంభ దశలో సుమారు రూ. 500 కోట్ల భారీ రక్షణ రంగ పెట్టుబడి
- ఈ క్షిపణి ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 2,000 మందికి ఉపాధి అవకాశాలు
- హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ, బీడీఎల్ రక్షణ సంస్థల నెట్‌వర్క్ దీనికి ప్రధాన బలం
- ప్రాథమిక ల్యాండ్ సర్వే పూర్తి; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తుది అనుమతులు రావాలి

02

### భారీగా పెరగనున్న భూముల ధరలు!

- ప్రాజెక్ట్ హైప్‌తో స్థానికంగా ల్యాండ్ రేట్లు 3 రెట్లు పెరిగే చాన్స్
- ప్రాథమిక సర్వే పూర్తి; కేంద్ర రక్షణ శాఖ తుది అనుమతులు రావాలి
- దేవరకద్రలో 416 ఎకరాల్లో బ్రహ్మోస్ మిస్సైల్ ప్లాంట్ ప్రతిపాదన
- NH-44 హైవే, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు దగ్గరగా అనుకూలమైన రూట్
- రూ. 500 కోట్ల పెట్టుబడి; 2,000 మందికి ఉపాధి అవకాశాలు
- కొత్త లేఅవుట్లతో పారిశ్రామిక పట్టణంగా మారనున్న గ్రామీణ ప్రాంతం

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

- ఉద్యోగులకు ప్రమాద జీవిత బీమాను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది
- సీఎం రేవంత్ రెడ్డి రవీంద్ర భారతిలో ప్రారంభిస్తారు
- శాశ్వత, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపు
- ప్రీమియం లేకుండానే 10 లక్షల కుటుంబాలకు భరోసా
- ప్రమాద మరణానికి రూ.60 లక్షల నుండి రూ.2 కోట్లు
- అమలుకు 14 బ్యాంకులు ప్రభుత్వంతో ఒప్పందం

03

## రాజకీయ రంగు పులుముకున్న వెటా

- హైదరాబాద్‌లో మహిళా సాధికారత సంస్థ 'వెటా' ఇండియా ప్రారంభం
- పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు
- మహిళల్లో నాయకత్వ, ఆర్థిక నైపుణ్యాల పెంపు
- మంత్రులు సీతక్క, కొండా సురేఖ గైర్హాజరు
- కవిత హాజరుపై అధికార పార్టీలో భిన్నాభిప్రాయాలు
- ఝాన్సీ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నేతలు అసహనం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
మహిళా సాధికారత, అభివృద్ధి, నాయకత్వ వికాసమే లక్ష్యంగా అమెరికాలో విజయవంతంగా కొనసాగుతున్న ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ వెటా సేవలు ఇండియాలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన ఈ ప్రారంభోత్సవ వేడుకకు రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై సందడి చేశారు. వెటా ఫౌండర్, చైర్‌పర్సన్ ఝాన్సీ రెడ్డి అతిథులకు ఘన స్వాగతం పలికారు. మిగతా 2లో..

## తుంగభద్ర జలాల్లో మన వాటా ఏదీ?

- రావాల్సిన 15.9 టీఎంసీలలో 5-6 టీఎంసీలే అందడంపై ఆందోళన
- తుంగభద్ర బోర్డును బలోపేతం చేయాలని డిమాండ్
- పెండింగ్ పనుల వేగవంతానికి ఆదేశం
- పూడిక తొలగింపునకు కర్ణాటక సహకారం కోరాలని నిర్ణయం
- మల్లమ్మకుంట రిజర్వాయర్ సామర్థ్యం పెంపు
- మూడు రాష్ట్రాల సీఎంల సమావేశంలో సమస్యల ప్రస్తావన




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణకు రావాల్సిన తుంగభద్ర నీటి వాటా, ఆర్డీఎస్ కాలువ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పకడ్బందీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. బుధవారం సాయంత్రం జలసౌధలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, మంత్రులతో నిర్వహించిన కీలక సమీక్షలో ఆయన జలవనరుల లభ్యతపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మూడు రాష్ట్రాల మధ్య చిక్కుముడిలా మారిన అంతర్రాష్ట్ర నదీ జలాల పంపిణీ సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర జల సంఘం తక్షణమే రంగంలోకి దిగాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రాజెక్టుల నిర్వహణలో జరుగుతున్న జాప్యం రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని, ఇకపై అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. తుంగభద్ర డ్యామ్ నుంచి తెలంగాణకు హక్కుగా దక్కాల్సిన 15.9 టీఎంసీల నీటిపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రానికి అందుతున్న నీరు ఐదొంతుల కన్నా తక్కువగా ఉండటం, అంటే కేవలం 5 నుంచి 6 టీఎంసీలకే పరిమితం కావడం తీవ్ర అన్యాయమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల జోగులాంబ గద్వాల జిల్లాలోని 75 గ్రామాలకు చెందిన దాదాపు 84 వేల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే ప్రమాదం నెలకొందని ఆవేదన చెందారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మిగతా 2లో..

## కొడంగల్ కోసం కృష్ణా జలాల బేరం

- కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై ప్రభుత్వం మౌనం వహించడం దారుణం
- కొత్త ప్రాజెక్టులతో ఆర్డీఎస్, భీమా ఆయకట్టుకు భారీ నష్టం
- కొడంగల్ లిఫ్ట్ కోసం కర్ణాటకతో లోపాయికారీ ఒప్పందం
- కేంద్ర సంస్థలకు అభ్యంతరం తెలపకపోవడం ప్రభుత్వ అసమర్థత
- అక్రమ పనులను అడ్డుకోవాలి, సుప్రీంకోర్టును ఆశ్రయించాలి
- రైతుల కోసం బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుంది

03




## కాంగ్రెస్ పాలన దుర్మార్గం

- వేల కోట్ల అక్రమాలకు మంత్రుల పాల్పడుతున్నారు
- సీతారామ మట్టిలో రూ. 100 కోట్ల కుంభకోణం
- రైతుబంధు, బోనస్ ఎగ్గొడుతూ ప్రభుత్వం మోసం
- రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులపై వేధింపులు
- యూరియా యాప్ రద్దు, నేరుగా పంపిణీకి హామీ
- కాంగ్రెస్ పాలనతో విసిగిపోయి కేసీఆర్‌ను కోరుకుంటున్నారు

03



# పాలమూరులో 'బ్రహ్మోస్' క్షిపణుల తయారీ?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రక్షణ రంగ తయారీలో తెలంగాణకు మరో భారీ అవకాశం తలుపు తడుతోంది. ప్రపంచంలోని వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణుల్లో ఒకటైన బ్రహ్మోస్‌కు సంబంధించిన తయారీ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కదలికలు మొదలైనట్లు సమాచారం. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల సమీపంలో సుమారు 416 ఎకరాల భూమిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు తుది అనుమతులు లభిస్తే ఇది కేవలం పాలమూరు పారిశ్రామిక ముఖచిత్రాన్నే కాకుండా తెలంగాణ రక్షణ రంగ వ్యవస్థలో భారీ మార్పులు తెచ్చే పెద్ద పెట్టుబడిగా మారే అవకాశం ఉంది. ఇప్పటివరకు వ్యవసాయం, వలసలు, సాధారణ పరిశ్రమల చర్చలకే పరిమితమైన పాలమూరు ప్రాంతం రక్షణ తయారీ రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశాన్ని ఈ ప్రతిపాదన తెచ్చిపెట్టింది. భూమి, సముద్రం, గగనం నుంచి ప్రయోగించగల సామర్థ్యం బ్రహ్మోస్ ప్రత్యేకత కావడంతో దేశ రక్షణలో ఇది అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తోంది. బ్రహ్మోస్ వంటి అత్యంత సున్నితమైన రక్షణ తయారీ ప్రాజెక్టులకు భద్రత, భూమి లభ్యత, రోడ్డు కనెక్టివిటీ, విమానాశ్రయానికి చేరువ, ఇప్పటికే ఉన్న సాంకేతిక పర్యావరణం వంటి అంశాలు కీలకం. దేవరకద్ర ఈ కోణాల్లో అనుకూలంగా ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ప్రతిపాదిత స్థలం జాతీయ రహదారి 44కి సమీపంలో ఉంది. హైదరాబాద్‌ను బెంగళూరుతో కలిపే ఈ మార్గం దేశంలో అత్యంత ముఖ్యమైన రవాణా కారిడార్లలో ఒకటిగా నిలిచింది. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉండటం లాజిస్టిక్స్ పరంగా ప్రయోజనకరంగా భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన సంస్థలు ఇప్పటికే బలంగా ఉన్నాయి. ప్రత్యేకించి డిఆర్‌డిఎల్ పక్కన ఇప్పటికే బ్రహ్మోస్ ఇంటెగ్రేషన్ కాంప్లెక్స్ ఉంది. ఇక్కడ క్షిపణులకు వివిధ వ్యవస్థలతో అనుసంధానించే పని జరుగుతుంది. డిఆర్‌డిఓ ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, మిధాని, హెచ్‌ఏఎల్ కార్యకలాపాలు, ప్రైవేట్ ఏరోస్పేస్ కంపెనీలు తెలంగాణకు బలమైన పునాది కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు దగ్గరగా, విస్తారమైన భూమి అందుబాటులో ఉండే మహబూబ్‌నగర్‌ను విస్తరణ కేంద్రంగా చూడవచ్చన్న అభిప్రాయం ఉంది. దేవరకద్రలో ప్రతిపాదిత బ్రహ్మోస్ యూనిట్ కోసం చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల పరిసరాల్లో భూమి పరిశీలన జరిగినట్లు సమాచారం. పరిశ్రమల శాఖ స్థాయిలో భూమి గుర్తింపు, ప్రాథమిక సౌకర్యాల పరిశీలన, ప్రాజెక్టు అనుకూలతపై కసరత్తు జరిగినట్లు తెలుస్తోంది. భూమి సుమారు 400 నుంచి 416 ఎకరాల మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. రక్షణ తయారీ యూనిట్‌కు ప్రధాన ఉత్పత్తి ప్రాంతం మాత్రమే కాకుండా పరీక్షలు, నిల్వ, భద్రతా వలయం, రవాణా సౌకర్యాలు, అనుబంధ పరిశ్రమల కోసం విస్తారమైన స్థలం అవసరం అవుతుంది. అందుకే ఇలాంటి ప్రాజెక్టులకు పెద్ద భూప్రాంతం సేకరిస్తున్నారు. ఈ దశలో ప్రాజెక్టు ఇంకా ప్రతిపాదన, స్థల పరిశీలన, అనుమతుల దశలోనే ఉంది. కేంద్ర రక్షణ శాఖ, బ్రహ్మోస్ ఏరోస్పేస్, రాష్ట్ర ప్రభుత్వం స్థాయిల్లో తుది నిర్ణయాలు పూర్తయ్యాకే నిర్మాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బ్రహ్మోస్ అనేది భారత్, రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థ. భారత డిఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మాషినోస్ట్రోయేనియా భాగస్వామ్యంతో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఏర్పడింది. బ్రహ్మపుత్ర, మోస్క్వా నదుల పేర్ల నుంచి బ్రహ్మోస్ అనే పేరు వచ్చింది. ఈ క్షిపణిని భూమి, సముద్రం, గగనం, జలాంతర్గామి వేదికల నుంచి ప్రయోగించవచ్చు. వేగం, ఖచ్చితత్వం, వివిధ వేదికల నుంచి ప్రయోగించగల సామర్థ్యం కారణంగా బ్రహ్మోస్ భారత రక్షణ వ్యవస్థలో కీలకమైన ఆయుధంగా గుర్తింపు పొందింది. ఇటీవలి సంవత్సరాల్లో బ్రహ్మోస్ కేవలం భారత సైనిక సామర్థ్యానికే కాకుండా రక్షణ ఎగుమతులకూ ముఖ్యమైన ఉత్పత్తిగా మారింది. ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ వ్యవస్థల ఎగుమతి ఒప్పందం తర్వాత ఈ క్షిపణి అంతర్జాతీయ మార్కెట్‌లో భారత తయారీ సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రస్తుతం యూఏఈ కూడా ఈ వ్యవస్థను కొనుగోలు చేయాలనే ఆసక్తితో ఉందనే వార్తలు వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీ ఇప్పటికే ప్రారంభమైంది. ఆ యూనిట్‌లో అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ వంటి కీలక ప్రక్రియలు జరుగుతున్నాయి. లక్నో యూనిట్ ప్రారంభం తర్వాత బ్రహ్మోస్ తయారీ సామర్థ్యాన్ని పెంచడం, సరఫరా గొలుసును బలపరచడం, దేశీయ రక్షణ తయారీని విస్తరించడం వంటి అంశాలపై కేంద్రం దృష్టి పెట్టింది. తెలంగాణలో కొత్త యూనిట్‌పై చర్చలు జరగడం సహజమైన పరిణామంగా పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న రక్షణ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, మెటీరియల్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ సామర్థ్యాలు ఈ ప్రతిపాదనకు బలం చేకూరుస్తున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టుకు ప్రారంభ దశలో సుమారు 500 కోట్ల రూపాయల పెట్టుబడి రావొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రక్షణ తయారీ యూనిట్‌లు సాధారణ పరిశ్రమల కంటే భిన్నంగా ఉంటాయి. భద్రతా ప్రమాణాలు, నాణ్యత పరీక్షలు, ప్రత్యేక పరికరాలు, అధునాతన తయారీ సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం అవుతాయి. ఈ యూనిట్ ఏర్పడితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 నుండి 2,000 ఉద్యోగాలు రావొచ్చని అంచనా వేస్తున్నారు. తయారీ, ఇంజినీరింగ్, నాణ్యత నియంత్రణ, లాజిస్టిక్స్, భద్రత, మెయింటెనెన్స్, పరిపాలన, అనుబంధ సేవల రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడే వీలుంది. దీనితో పాటు చిన్న, మధ్య తరహా అనుబంధ పరిశ్రమలకు కొత్త అవకాశాలు తెరుచుకోవచ్చు. రక్షణ తయారీ రంగంలో ఒక్క ప్రధాన యూనిట్ వచ్చినా దానికి సరఫరా చేసే భాగాలు, సామాగ్రి, పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్, రవాణా వంటి రంగాల్లో స్థానిక వ్యాపారాలకు అవకాశం పెరుగుతుంది. మహబూబ్‌నగర్ జిల్లా చాలా కాలంగా వలసల జిల్లాగా గుర్తింపు పొందింది. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్డు కనెక్టివిటీ, హైదరాబాద్‌కు చేరువ, కొత్త పెట్టుబడులతో ఈ ప్రాంతం గత కొన్నేళ్లుగా మార్పు దశలో ఉంది. బ్రహ్మోస్ వంటి హైటెక్ రక్షణ తయారీ యూనిట్ ఇక్కడికి వస్తే అది ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మలుపు అవుతుంది. దేవరకద్ర పరిసరాల్లో మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం ఉంది. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, భద్రతా వ్యవస్థలు, కార్మికులకు నివాసాలు, శిక్షణా కేంద్రాలు, విద్యా సంస్థలు, చిన్న వ్యాపారాలు పెరగొచ్చు. హోటళ్లు, రవాణా, రియల్ ఎస్టేట్, సేవా రంగాలకూ దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది. తెలంగాణ ఇప్పటికే దేశంలోని ముఖ్యమైన ఏరోస్పేస్, డిఫెన్స్ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. హైదరాబాద్ పరిసరాల్లో డిఆర్డీఓ ల్యాబ్స్, బిడిఎల్, మిధాని, ఈసిఐఎల్, హెచ్‌ఏఎల్ కార్యకలాపాలు, అంతర్జాతీయ ఏరోస్పేస్ సంస్థల భాగస్వామ్యాలు ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో ప్రెసిషన్ ఇంజినీరింగ్, డ్రోన్స్, ఏరోస్ట్రక్చర్స్, రక్షణ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సంస్థలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ యూనిట్ ఏర్పడితే హైదరాబాద్‌కు దక్షిణంగా కొత్త రక్షణ తయారీ వలయం ఏర్పడే అవకాశం ఉంది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, బెంగళూరు మార్గం భవిష్యత్తులో డిఫెన్స్, ఏరోస్పేస్ తయారీకి మరింత కీలకంగా మారవచ్చు. ఈ ప్రాజెక్టు అమలు విషయంలో ఇంకా కీలక దశలు మిగిలే ఉన్నాయి.




## భారీగా పెరగనున్న భూముల ధరలు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ పారిశ్రామిక రంగానికి రక్షణ రంగ తయారీ రూపంలో ఒక అద్భుతమైన అవకాశం లభించబోతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్ తయారీ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రాథమిక అంచనాలు సిద్ధమవుతున్నాయి. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో ఇందుకు సంబంధించిన భూముల గుర్తింపు ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ భారీ ప్రాజెక్టు గనుక కార్యరూపం దాల్చితే పాలమూరు ప్రాంత ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. వ్యవసాయం, వలసల జిల్లాగా ఉన్న మహబూబ్‌నగర్ భవిష్యత్తులో దేశ రక్షణ మ్యాప్‌లో అత్యంత కీలకమైన కేంద్రంగా ఎదిగేందుకు ఈ ప్రతిపాదన గట్టి పునాది వేయబోతోంది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు కోసం అధికారులు దేవరకద్ర మండల పరిధిలో సుమారు 416 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. రక్షణ రంగానికి చెందిన సున్నితమైన క్షిపణి ఆయుధాల తయారీ, నిల్వ, పరీక్షల నిర్వహణకు విస్తారమైన స్థలంతో పాటు కట్టుదిట్టమైన భద్రతా వలయం అత్యంత అవసరం. అందుకే అన్ని వసతులకు అనుకూలంగా ఉండేలా ఈ మూడు గ్రామాల సరిహద్దుల్లోని భూములను పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్ర రక్షణ శాఖ, బ్రహ్మోస్ సంస్థ ఉన్నతాధికారుల నుంచి తుది అనుమతులు లభించిన వెంటనే భూముల బదలాయింపు ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ ప్రాంతం జాతీయ రహదారి 44 కి అత్యంత సమీపంలో ఉండటం రవాణా పరంగా పెద్ద అనుకూల అంశంగా మారింది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రతిపాదిత స్థలానికి సుమారు 100 కిలోమీటర్ల దూరంలోనే ఉండటంతో రవాణా ఖర్చులు, సమయం భారీగా కలిసిరానున్నాయి. రాజధాని నగరంలో ఇప్పటికే ఉన్న డిఆర్‌డిఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, మిధాని వంటి ప్రభుత్వ రక్షణ సంస్థల నెట్‌వర్క్ ఈ కొత్త కేంద్రానికి సాంకేతిక సహాయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. శంషాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే దారి పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ కొత్త క్షిపణి కేంద్రం రాక మరింత ఊపు తీసుకురానుంది. క్షిపణుల అసెంబ్లింగ్, అనుసంధాన ప్రక్రియలకు అవసరమైన ముడిసరుకును హైదరాబాద్ నుంచి సులభంగా తరలించేందుకు ఈ రహదారి కనెక్టివిటీ ఎంతో దోహదపడుతుంది. ఈ ప్రతిపాదన తెరపైకి రాగానే దేవరకద్ర పరిసర ప్రాంతాల్లో భూముల వ్యాపారం ఒక్కసారిగా ఊపందుకుందుకునే అవకాశం ఉంది. బ్రహ్మోస్ కేంద్రం ఏర్పాటు కాబోతోందనే ప్రచారంతో చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలు వస్తాయని భావిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు సాధారణ వ్యవసాయ భూములుగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు గజాల లెక్కన వ్యాపారాలు మొదలుకానున్నాయి. రాబోయే రోజుల్లో ఇక్కడ మౌలిక సదుపాయాలు మెరుగవుతాయనే ఆశతో పెట్టుబడిదారులు భారీగా భూములు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. పారిశ్రామిక వేత్తలు, వ్యాపార సంస్థలు ఈ ప్రాంతం చుట్టూ ఉన్న భూములపై కన్నేయడంతో స్థానికంగా ఆస్తుల విలువలు మునుపెన్నడూ లేని విధంగా 3 రెట్లు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. పారిశ్రామికంగా రాబోయే ఈ మార్పు కేవలం భూముల ధరలకే పరిమితం కాకుండా స్థానిక రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక కొత్త మలుపు తిప్పనుంది. క్షిపణి తయారీ కేంద్రం చుట్టూ నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, కార్మికుల వసతి గృహాల నిర్మాణం పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. దేవరకద్ర, మహబూబ్‌నగర్ పట్టణాల మధ్య కొత్త లేఅవుట్లు, ప్లాట్ల అమ్మకాలు జోరందుకునే వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది. పారిశ్రామిక అవసరాల కోసం వచ్చే ఉద్యోగులు, అధికారుల నివాసాల కొరతను తీర్చేందుకు పెద్ద ఎత్తున భవన నిర్మాణ సంస్థలు ఇక్కడికి తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల రాబోయే 5 సంవత్సరాలలో ఈ గ్రామీణ ప్రాంతం కాస్తా ఒక ఆధునిక పారిశ్రామిక పట్టణంగా రూపాంతరం చెందే వీలుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభ దశలో సుమారు 500 కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో కార్యకలాపాలు మొదలుపెట్టే అవకాశం ఉందని పారిశ్రామిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. రక్షణ రంగ పరిశ్రమలు సాధారణ కర్మాగారాల కంటే భిన్నంగా అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తాయి. ఈ కేంద్రం ద్వారా స్థానికంగా ఉన్న యువతకు పారిశ్రామిక రంగంలో సరికొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ఇంజనీరింగ్, సాంకేతిక నైపుణ్యం కలిగిన స్థానిక యువతకు ఈ కేంద్రం ఒక గొప్ప వరంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రధాన క్షిపణి ఉత్పాదక కేంద్రంతో పాటు దానికి అనుబంధంగా పనిచేసే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా ఇక్కడ కొలువుదీరనున్నాయి. క్షిపణి విడిభాగాలు, ప్యాకేజింగ్ సామగ్రి, రవాణా సేవలు అందించే వందలాది చిన్న వ్యాపారాలు చుట్టుపక్కల విస్తరిస్తాయి. స్థానిక యువత సొంతంగా పరిశ్రమలు స్థాపించుకునేందుకు, వ్యాపారాలు చేసుకునేందుకు ఇదొక సువర్ణావకాశం అవుతుంది. హోటళ్లు, రవాణా రంగాలు, నిత్యావసర వస్తువుల దుకాణాల వ్యాపారం ఊహించని స్థాయిలో పుంజుకుంటుంది. పాలమూరు జిల్లాలో చాలా కాలంగా ఉన్న నిరుద్యోగ సమస్యకు, వలసల నివారణకు ఈ పారిశ్రామిక ప్రస్థానం గట్టి పరిష్కారం చూపించబోతోంది. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో బ్రహ్మోస్ టెస్టింగ్ కేంద్రం విజయవంతంగా పనిచేస్తున్న తరుణంలో, రెండో పెద్ద కేంద్రంగా తెలంగాణను ఎంచుకోవడం రాష్ట్ర ప్రతిష్టను పెంచుతుంది. క్షిపణుల అంతర్జాతీయ ఎగుమతులు కూడా పెరుగుతుండటంతో ఈ తయారీ కేంద్రానికి భవిష్యత్తులో మరింత ప్రాధాన్యత లభిస్తుంది. ఫిలిప్పీన్స్ వంటి దేశాలతో జరిగిన రక్షణ ఒప్పందాల నేపథ్యంలో, ఇక్కడ తయారయ్యే ఆయుధాలు అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటాయి. ఇది తెలంగాణను దేశంలోనే అతిపెద్ద రక్షణ రంగ హబ్‌గా మార్చడానికి దోహదపడుతుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే కారిడార్ మొత్తం భవిష్యత్తులో పారిశ్రామికంగా అత్యంత శక్తివంతమైన ప్రాంతంగా అవతరిస్తుంది. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కడానికి ఇంకా కొన్ని కీలకమైన అనుమతుల ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉంది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ క్షేత్రస్థాయి నివేదికలను పరిశీలించిన తర్వాత పర్యావరణ, భద్రతా పరమైన అనుమతులను మంజూరు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి ప్రాథమిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సాధారణ పరిశ్రమల వలె రక్షణ రంగ ప్రాజెక్టులను వేగంగా ప్రారంభించడం సాధ్యం కాదు కాబట్టి, ప్రతి దశను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తారు. అన్ని స్థాయిల్లో సానుకూల నిర్ణయాలు వస్తే వచ్చే ఏడాది నాటికి నిర్మాణ పనులు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి. పాలమూరు పారిశ్రామిక ప్రగతికి ఈ బ్రహ్మోస్ ప్రతిపాదన ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిపోవడం ఖాయం. ఒకవైపు రాష్ట్రానికి వందల కోట్ల పెట్టుబడులు, మరోవైపు వేలాది మందికి ఉపాధి, ఇంకోవైపు స్థానిక రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు లభించనున్నాయి. భూముల ధరలు పెరగడం వల్ల స్థానిక రైతులకు, ఆస్తుల యజమానులకు ఆర్థికంగా పెద్ద లబ్ధి చేకూరుతుంది. ఎటు చూసినా దేవరకద్ర పరిసర ప్రాంతాలు రాబోయే రోజుల్లో ఒక నూతన శకానికి స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ మహా ప్రాజెక్టుకు తుది ఆమోదం లభిస్తే తెలంగాణ రక్షణ రంగ ప్రస్థానం ప్రపంచ స్థాయికి చేరుకుంటుంది.

# రాజకీయ రంగు పులుముకున్న 'వెటా'






**మొదటి పేజీ తరువాయి**

ఈ కార్యక్రమం మహిళల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ సంస్థ ఇప్పుడు మన గడ్డపై మహిళా ప్రగతికి దిక్సూచిగా నిలవనుంది. ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఝాన్సీ రెడ్డి వారికి పుష్పగుచ్చాలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. వీరితో పాటు భారతీయ మహిళా జాతీయ సమాఖ్య సీనియర్ లీడర్ ప్రేమ్ పావని, భారతీయ మహిళా మోర్చా తెలంగాణ శాఖ అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అభితేజ కొండ, సునీత గంపా, శైలజా కల్లూరి, విశ్వ వేమిరెడ్డి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ మహిళలు ప్రతి రంగంలో ముందంజలో నిలవాలంటే నాయకత్వ నైపుణ్యాలు, ఆర్థిక స్వావలంబన, సామాజిక అవగాహన అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. మహిళల విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో వెటా ఇండియా కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అమెరికాలో ఇప్పటికే నెట్‌వర్కింగ్, లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ల ద్వారా వెటా ప్రత్యేక ముద్ర వేసింది. ఇప్పుడు అదే ఒరవడిని ఇండియాలో కొనసాగించి మహిళలకు బలమైన వేదికగా మారబోతోందని నిర్వాహకులు వివరించారు. గ్రామీణ స్థాయి నుంచి నగరాల వరకు మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. అయితే ఈ వేడుక ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపింది. వరంగల్ జిల్లాకు చెందిన కీలక నేతలు, ముఖ్యంగా ఇద్దరు మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జిల్లాలో వారితో పాటు సన్నిహితంగా ఉండే ఇంఛార్జ్ మంత్రులు కూడా హాజరుకాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఝాన్సీ రెడ్డి కుటుంబానికి పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యత తగ్గిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీ నేతలే ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావడం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటో తెలియక కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలవడం ఇప్పుడు అధికార పార్టీలో హాట్ టాపిక్ అయ్యింది. విపక్ష నాయకురాలైన కవిత సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారి వేదికను పంచుకోవడంపై సొంత పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాలలో లేదా సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రతిపక్ష నేతల ప్రాధాన్యత పెరగడం వెనుక ఉన్న మతలబు ఏమిటోనని రాజకీయ పండితులు చర్చిస్తున్నారు. ఈ పరిణామం ఝాన్సీ రెడ్డిపై పార్టీ అధిష్టానం గుర్రుగా ఉందా లేక ఆమె స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారా అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఝాన్సీ రెడ్డి కుటుంబం పార్టీలో పట్టు కోల్పోయిందా అనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతంలో ఆమెకు ఉన్న ప్రాముఖ్యత ఇప్పుడు కనపడటం లేదని, ఆమెను దూరం పెట్టడం వల్లే కీలక మంత్రులు ఈ వేడుకకు ముఖం చాటేశారని పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. రాజకీయంగా ఎదుగుతున్న క్రమంలో ఆమె తీసుకుంటున్న నిర్ణయాలు పార్టీలో చిచ్చుకు కారణమవుతున్నాయా అన్న కోణంలో కూడా విశ్లేషణలు నడుస్తున్నాయి. పట్టు సాధించాలని ప్రయత్నిస్తున్న ఝాన్సీ రెడ్డికి సొంత పార్టీ నేతల గైర్హాజరు పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించింది. ఈ వేడుకకు హాజరైన మహిళా లోకం మాత్రం ఎంతో ఉత్సాహంతో కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు, సామాజిక కార్యకర్తలు, వ్యాపారవేత్తలు తరలివచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళల గళాన్ని వెటా ఇండియా ప్రపంచానికి వినిపిస్తుందని వారు నమ్మకంతో ఉన్నారు. కేవలం నగరాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాల్లో ఉన్న వారికి కూడా ఈ సంస్థ సహకారం అందాలని కోరుకుంటున్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసేలా చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇస్తామని మహిళా సంఘాలు ప్రకటించాయి. రాజకీయ వివాదాలు, చర్చలు ఎలా ఉన్నా, ఒక మంచి సామాజిక సేవా కార్యక్రమం ఇలా రాజకీయ రంగు పులుముకోవడం దురదృష్టకరమని సామాన్య ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మహిళా సాధికారత విషయంలో రాజకీయ పార్టీలు, నాయకులు ఏకతాటిపైకి వచ్చి పనిచేయాల్సిన అవసరం ఉంది. కేవలం తమ వర్గీయులకే ప్రాధాన్యతనివ్వడం, ప్రత్యర్థులను దూరం పెట్టడం వల్ల మహిళా అభివృద్ధి కుంటుపడుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయాలను పక్కన పెట్టి మహిళల భవిష్యత్తు కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైంది. అమెరికా వంటి దేశాల్లో విజయవంతమైన వెటా ప్రయోగం ఇప్పుడు ఇండియాలో ఎలాంటి ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి. ఆర్థిక స్వావలంబన, వ్యాపార నైపుణ్యాల పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తే తప్పక మార్పు వస్తుంది. వచ్చే రోజుల్లో వెటా ఇండియా ఎలాంటి కార్యక్రమాలు చేపడుతుందో, గ్రామీణ మహిళల జీవితాల్లో ఎంతటి వెలుగులు నింపుతుందోనని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా పని చేసినప్పుడే ఈ సంస్థ తన లక్ష్యాలను పూర్తిగా సాధించగలదు. ఏది ఏమైనా జూబ్లీహిల్స్ వేదికగా జరిగిన ఈ ప్రారంభోత్సవం రాష్ట్ర రాజకీయాల్లో మాత్రం పెద్ద చర్చకు తెరలేపింది. నిజానికి సామాజిక మార్పు అనేది రాజకీయాలకు తావు లేకుండా జరిగినప్పుడే దాని ఫలితాలు ప్రజలకు చేరువవుతాయి. వెటా ఇండియా సంస్థ ప్రారంభోత్సవం ద్వారా మహిళల భవిష్యత్తు కోసం చేస్తున్న కృషి అభినందనీయం. భవిష్యత్తులో ఈ సంస్థ మరెన్నో విజయాలను సొంతం చేసుకుని దేశవ్యాప్తంగా మహిళల కోసం ప్రత్యేకమైన సేవలు అందించాలని ఆశిద్దాం. రాజకీయాలను పక్కన పెట్టి కేవలం మహిళా అభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా చేసుకుంటే ఈ సంస్థ ఖచ్చితంగా గొప్ప గుర్తింపు సాధిస్తుంది. రాష్ట్రంలో మహిళలందరూ గర్వించే స్థాయికి వెటా చేరుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.



## తుంగభద్ర జలాల్లో మన వాటా ఏదీ?



**మొదటి పేజీ తరువాయి**

కర్ణాటక రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తుంగభద్ర బోర్డును మరింత పటిష్టం చేయాలని, తద్వారా రాష్ట్ర వాటా నీరు సక్రమంగా వచ్చేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ఆనకట్ట ప్రస్తుతం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఆనకట్ట భద్రతా పనులను తక్షణమే గుర్తించి యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆయన ఆదేశించారు. కెనాల్ మోడర్నైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 59 కోట్లు డిపాజిట్ చేసినప్పటికీ, ప్యాకేజీ ఒకటి, రెండు పనులు ఇంకా మొదలుకాకపోవడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మూడు, నాలుగు పనులు మాత్రమే పూర్తయ్యాయని తెలియడంతో, పెండింగ్ పనుల అంశాన్ని ప్రధానంగా ఎజెండాలో చేర్చాలని సూచించారు. రేపు కేంద్ర జల శక్తి మంత్రి ఆధ్వర్యంలో జరగబోయే మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ అంశంపై గట్టిగా వాదించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు భారీగా పూడిక పేరుకుపోవడంతో ఆశించిన స్థాయిలో నీటి మళ్లింపు జరగడం లేదని ఇంజనీర్లు వివరించారు. పూడిక తీయడం ద్వారా నీటి ప్రవాహాన్ని పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం సహకారం తప్పనిసరి అని సీఎం స్పష్టం చేశారు. రెండు వేల నాలుగు నాటి ఎక్స్‌పర్ట్ కమిటీ రిపోర్ట్ ప్రకారం కర్ణాటక భూభాగంలో ఉన్న పూడికను తొలగించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఆదేశించారు. ఆ కమిటీ సిఫార్సులు, ప్రస్తుత వాస్తవ పరిస్థితులతో కూడిన సమగ్ర నివేదికను కేంద్రానికి వెంటనే సమర్పించాలని ఇరిగేషన్ శాఖకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుంగభద్ర లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో గరిష్ట నీటి వినియోగానికి ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా తుమ్మిళ్ల నుంచి నీటిని వాడుకునేందుకు వీలుగా మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయడం వల్ల గద్వాల ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు తీరుతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్టుల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించేందుకు ఇంజనీర్లు నిరంతరం పర్యటించాలని ఆదేశించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని, ఇకపై ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కేంద్ర నిధుల వాడకంలో కూడా ఎక్కడా వెనకడుగు వేయకుండా, పెండింగ్‌లో ఉన్న ప్రతి పైసాను రాబట్టేలా కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నీటి యాజమాన్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం వల్ల అద్భుత ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్ వద్ద ఉన్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి పంపిణీలో అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర ఒప్పందాలను గౌరవించే విషయంలో తెలంగాణ ఎప్పుడూ ముందుంటుందని, అదే సమయంలో మన రాష్ట్రానికి దక్కాల్సిన హక్కుల కోసం ఎవరి దగ్గరైనా గళం విప్పడానికి సిద్ధమని సీఎం ప్రకటించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే ఈ ప్రభుత్వ ప్రధాన అజెండా అని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి రాజీ లేకుండా నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం, పొరుగు రాష్ట్రాలతో సఖ్యతతో ఉంటూనే సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో పాల్గొన్న వారందరూ సీఎం నిర్ణయాలకు మద్దతు తెలిపారు. నీటి వాటాల విషయంలో పూర్తి స్పష్టతతో ఉండాలని సీఎం వారికి సూచించారు. రాష్ట్రంలోని ప్రతి సాగునీటి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు వివరించారు. తుంగభద్ర ఆయకట్టు కింద ఉన్న రైతుల కష్టాలను తీర్చేందుకు ఈ సమావేశం ఒక గొప్ప మలుపుగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల ఆధునికీకరణ వల్ల పంటల దిగుబడి పెరుగుతుందని, ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని సీఎం వివరించారు.

## ఓడిన గెలిచిన ప్రజల మధ్యనే ఉండాలి

- నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు అందరి సమన్వయం చేసుకోవాలి
- పార్టీని బలోపేతం చేయాలి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**చౌటుప్పల్, విశాలభారతి:** నాయకుడనే వాడు ప్రజలకు దగ్గరగా ఉండి వారి బాధలు విని, వారిని గౌరవించినప్పుడే నాయకుడిగా ప్రజల్లో మనగలుగుతాడని అన్నారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. చౌటుప్పల్ పట్టణంలోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతనంగా ఎంపికైన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు చౌటుప్పల్ పట్టణ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై ఇరువురిని అభినందించారు. గ్రామస్థాయిలో మండల స్థాయిలో పట్టణ స్థాయిలో నియోజకవర్గస్థాయిలో అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే సరైన ఫలితాలు వస్తాయని 2018 ఎన్నికల్లో మొత్తం టిఆర్ఎస్ పార్టీ గెలిస్తే మునుగోడులో మాత్రం కాంగ్రెస్ పార్టీ గెలిచిందని గుర్తు చేశారు.అందరూ కష్టపడతారని రాజకీయాలలో ఉండేవారు ఓపికతో పనులు చేసుకుంటూ పోతే పదవులు వస్తాయని అన్నారు.నాయకుడనేవాడు వ్యక్తిగతంగా మంచివాడ కాదా ప్రజలకు అందుబాటులో ఉంటున్నాడా లేదా ప్రజలకు మంచి పనులు చేస్తున్నాడా లేదా అని ప్రజలు సునిశితంగా గమనిస్తున్నారని అన్నారు.. గెలిచిన తర్వాత ప్రవర్తనలో మార్పు వస్తే వచ్చేసారి ప్రజల తీర్పు వ్యతిరేకంగా ఉంటుందని గుర్తు చేశారు.ప్రతి నాయకుడు ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్,చౌటుప్పల పట్టణ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి లు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాజగోపాల్ రెడ్డిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు మున్సిపల్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రఘునాథపురం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొనడం.. రాష్ట్ర ప్రజల సుభిక్షానికి ప్రత్యేక ప్రార్థనలు



**రాజాపేట, విశాలభారతి:** రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అయిలయ్యకి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ఆశీర్వాదాలు అందజేశారు. గర్భగుడిలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అయిలయ్య రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తదనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణమూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ కట్టుబాటు

- గుండ్రాతి మడుగులో వీవో భవనానికి శంకుస్థాపన చేసిన గార్లపాటి వెంకటరెడ్డి, భరద్వాజ్ రెడ్డి

**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతి మడుగు, మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకటరెడ్డి అన్నారు. కురవి మండలం గుండ్రాతి మడుగు గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘాల కోసం నిర్మించనున్న వీవో (విలేజ్ ఆర్గనైజేషన్) భవనానికి బుధవారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో డ్వాక్రా మహిళలకు ప్రత్యేక భవనాలు నిర్మించడం ద్వారా వారి కార్యకలాపాలకు మరింత బలం చేకూరుతుందని అన్నారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శంకుస్థాపన అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి యువత ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వీవో భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గార్లపాటి వెంకటరెడ్డి, గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ఇద్దరూ మహిళల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించి మహిళలకు మరింత సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ రాజేశ్వరి రామకృష్ణ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బీసీ ప్రజా సంఘం కొరివి మండల అధ్యక్షుడు మాచర్ల హరీష్, మహిళా సంఘాల అధ్యక్షులు, సీఏలు, మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బేతోలులో పీరీల సందడి

- సవార్లకు మొక్కులు చెల్లించిన భక్తులు
- మతసామరస్యానికి ప్రతీకగా బేతోలులో మొహరం వేడుకలు
- హసేన్–హుస్సేన్ త్యాగస్ఫూర్తిని చాటిన పీరీల పండుగ
- భక్తిశ్రద్ధలతో సవార్లకు మొక్కులు.. భారీగా తరలివచ్చిన భక్తజనం
- ఘనంగా మొహరం వేడుకలు
- హసేన్–హుస్సేన్ త్యాగాలకు నివాళి
- మతసామరస్యానికి ప్రతీక పీరీల పండుగ
- భక్తులతో కిటకిటలాడిన బేతోలు
- డప్పు చప్పుళ్ల మధ్య పీరీల ఊరేగింపు
- సోదరభావాన్ని చాటిన మొహరం వేడుకలు
- సవార్ల కొలువుతో ఆధ్యాత్మిక శోభ
- భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పీరీల పండుగ
- షేక్ ఖాదర్ బాబా





**మహబూబాబాద్ విశాల భారతి:**

మతసామరస్యం, త్యాగం, ధర్మం, మానవత్వానికి ప్రతీకగా నిలిచిన మొహరం పండుగ సందర్భంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామంలో బుధవారం పీరీల పండుగ అత్యంత వైభవంగా నిర్వహించారు. హసేన్ హుస్సేన్ అమర త్యాగాలను స్మరించుకుంటూ హిందూ, ముస్లిం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సవార్లకు ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, భక్తుల జయజయధ్వానాలు, డప్పు చప్పుళ్లతో పీరీల సందడి నెలకొంది. ఇస్లాం చరిత్రలో మొహరం నెలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రవక్త మహమ్మద్ మనవళ్లు హజ్రత్ ఇమామ్ హసేన్, హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌లు ధర్మ పరిరక్షణ కోసం చేసిన మహా త్యాగం ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. కర్బలా యుద్ధంలో అన్యాయానికి, అధర్మానికి తలవంచకుండా ప్రాణత్యాగం చేసిన వారి స్ఫూర్తి నేటికీ కోట్లాది మందికి మార్గదర్శకంగా నిలుస్తోంది. సత్యం కోసం, న్యాయం కోసం, మానవ విలువల కోసం వారు చేసిన త్యాగాన్ని స్మరించుకునేందుకే మొహరం వేడుకలను నిర్వహిస్తారు. బేతోలు గ్రామంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పీరీల గుండం వద్ద భక్తులు పాల మటికిలతో ఫాతిహాలు నిర్వహించి, అనంతరం పానకం పంపిణీ చేశారు. తమ కుటుంబ శ్రేయస్సు, పంటల సమృద్ధి, ఆరోగ్యం, సుఖశాంతుల కోసం సవార్లకు ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రంగురంగుల దట్టీలు, కుడకలు, బెల్లంతో తయారు చేసిన బాసింగాలు, తొట్టెలు సమర్పిస్తూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. కొందరు యాటపోతు కందుర్లు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొహరం పండుగ విశిష్టత ఏమిటంటే ఇది కేవలం ఒక మతానికి పరిమితం కాకుండా మతసామరస్యానికి ప్రతీకగా నిలవడం. బేతోలు గ్రామంలోనూ హిందూ, ముస్లిం సోదరులు కలిసి పీరీల పండుగను నిర్వహించడం విశేషం. మత భేదాలకు అతీతంగా ప్రతి కుటుంబం ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. హిందూ భక్తులు కూడా సవార్లకు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించడం, ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పీరీల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, భక్తుల నినాదాలు, సంప్రదాయ కళారూపాల మధ్య సాగిన ఈ ఊరేగింపు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ, హసేన్ హుస్సేన్‌ల త్యాగాలు ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు. ధర్మం, న్యాయం కోసం ప్రాణాలను అర్పించిన వారి జీవితాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. మానవత్వం, సహనం, సోదరభావం, ఐక్యత వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముజావర్లు, భక్తులు, మొహరం కమిటీ సభ్యులు షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్, షేక్ ఖాదర్ బాబా, షేక్ షరీఫ్, షేక్ షబ్బీర్, షేక్ ఫకీర్, షేక్ లతీఫ్, షేక్ జావిద్, షేక్ బాల్ సైద్, షేక్ యాకుబ్ పాషా, షేక్ ఖాజా, షేక్ పాషా, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీకగా, మతసామరస్యానికి చిరునామాగా, గ్రామ ఐక్యతకు నిదర్శనంగా బేతోలు పీరీల పండుగ మరోసారి ఘనంగా నిలిచింది.

## చలో హైదరాబాద్ యాత్రను విజయవంతం చేయండి

**టీఎస్ సిపిఎస్ ఈ యు రాష్ట్ర ఆర్గనైజగ్ రవిచంద్ర డిమాండ్**

**విశాలభారతి, గూడూరు:** ఎన్నికల వాగ్దానం ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం CPS విధానాన్ని రద్దు చేయాలి, ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలో నూ DSC2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ (ఓపీఎస్) వర్తింపజేయాలి, పీఎఫ్ఆర్డీఏ నిబంధనల్లో రాష్ట్రాలకు 'ఎగ్జిట్ పాలసీ' ఉందని నిరూపితం, టీఎస్సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో జూలైలో "జన జాగరణ యాత్ర", ఆగస్టు 23న "చలో హైదరాబాద్", గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి చంద్ర డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో జరిగిన ఒక ముఖ్యమైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేసే సంపూర్ణ రాజ్యాంగబద్ధమైన అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని ప్రస్తావించారు. ఏపీ కేబినెట్ నిర్ణయం ద్వారా 2004 కంటే ముందు వెలువడిన నోటిఫికేషన్ల ప్రకారం ఎంపికై, సాంకేతిక సమస్యల వల్ల నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ మార్గం సుగమమైందని తెలిపారు. ఇదే తరహాలో తెలంగాణలో సైతం ఎన్నో ఏళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న DSC2003 ఉపాధ్యాయులందరికీ తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని రవిచంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ చూపి, తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్పీఎస్/సీపీఎస్) నిబంధనల ప్రకారం రాష్ట్రాలు తాము దాచుకున్న నిధులను వెనక్కి తీసుకునేందుకు, చట్టబద్ధంగా వైదొలిగేందుకు (ఎగ్జిట్ పాలసీ) పూర్తి వెసులుబాటు ఉందనే విషయం ఏపీ ప్రభుత్వ నిర్ణయంతో నిరూపితమైందని ఆయన వివరించారు. కేంద్ర ఆర్థిక శాఖ (పీఎఫ్ఆర్డీఏ) వద్ద జమ అయిన రాష్ట్ర ప్రభుత్వ వాటాను తిరిగి రాష్ట్ర ఖజానాకు రాబట్టుకోవచ్చని, దీనివల్ల తెలంగాణ రాష్ట్రానికి దాదాపు రూ. 20 వేల కోట్ల అదనపు ఆర్థిక వనరులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ నిధులను రాష్ట్ర ప్రగతికి, సంక్షేమ పథకాలకు వాడుకునే గొప్ప అవకాశం ప్రభుత్వానికి ఉంటుందని తెలిపారు. సాంకేతిక సమస్యల బాధితులకు తక్షణ న్యాయం చేస్తూనే హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ తరహాలో రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ఒకే విడతలో ఓపీఎస్ పునరుద్ధరించడమే తమ సంఘం లక్ష్యమన్నారు.



**ఉద్యమ కార్యాచరణ పిలుపు:**

పాత పెన్షన్ సాధన కోసం సంఘం కేంద్ర కమిటీ పిలుపు మేరకు జూలై నెలలో నిర్వహించబోతున్న "జన జాగరణ యాత్ర"ను, అలాగే ఆగస్టు 23వ తారీఖున హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే "చలో హైదరాబాద్" కార్యక్రమాలను సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని రవిచంద్ర ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో TSCPSEU జిల్లా బాధ్యులు తోగరు కమలాకర్ రెడ్డి, మణికొండ రమేష్, నీలం రమేష్, గూడూరు మండల అధ్యక్షులు గజ్జి మల్లేశం, ప్రధాన కార్యదర్శి మంచోజు మనోహర్, కోశాధికారి కొలువుల రాము, పీఆర్టీయూ టీఎస్ (PRTU TS) గూడూరు మండల ప్రధానదర్శి మండల వెంకటేశ్వర్లు మరియు ఇతర సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీలో బోధనకు దరఖాస్తు ఆహ్వానం

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్నటువంటి పిజిసిఆర్టి సివిక్స్ , పిజిసిఆర్టి ఇంగ్లీష్, పిజిసిఆర్టి నర్సింగ్II పోస్టులకు ఈ విద్యా సంవత్సరానికి గాను తాత్కాలిక పద్ధతిలో పనిచేయుటకు స్థానికులు అయి ఉండి అర్హత గల మహిళ అభ్యర్థులు వారి యొక్క ధ్రువీకరణ పత్రాలతో తేదీ 25062026 నుండి 29062026 రోజున కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం వాజేడు యందు స్పెషల్ ఆఫీసర్ కి వ్యక్తిగతంగా దరఖాస్తులు సాయంత్రం 5 గంటలు లోపు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించవలసినదిగా తెలియజేశారు. పూర్తి వివరాలకు కేజీబీవీ వాజేడు స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి సుజాత 9010117750 నంబర్ ను సంప్రదించగలరు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



**దేవరుప్పుల విశాలభారతి:** జెడ్ పిహెచ్ఎస్ చిన్నమదూరు పాఠశాల విద్యార్థులకు మార్వాడి యువ మంచ్ జనగామ ప్రతినిధులు 380 నోటి పుస్తకాలను అందజేశారు. వాటితో పాటు మెన్స్ క్లబ్ ప్యాషన్స్ జనగాం వారి సౌజన్యంతో పాఠశాలలో కొత్తగా అడ్మిషన్ పొందిన 40 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందించారు. ఈ సందర్భంగా మార్వాడీ యువ మంచ్ ఆఫ్ జనగామ అధ్యక్షులు గీతేష్ బజాజ్ మాట్లాడుతూ, "విద్య ద్వారా విద్యార్థులు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పొందుతారు. చదువుకునే వయసులో చదువుకుని తీరాలి. సమయం దాటిన తరువాత ఏదీ తిరిగిరాదు. సమాజం నుండి పొంది సమాజానికి ఇవ్వడం అనే సదుద్దేశ్యంతో పాఠశాల విద్యార్థులు కొరకు తమవంతుగా నోటు పుస్తకాలు మరియు స్పోర్ట్స్ యూనిఫామ్ అందిస్తున్నామని, భవిష్యత్తులో పాఠశాలకు మరింత మద్దతును అందిస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా జి. కళావతి ఈ సందర్భంగా నోట్ బుక్స్ స్పోర్ట్స్ యూనిఫామ్ అందించినందుకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.చిన్న మదూర్ గ్రామ సర్పంచ్ మైదం జోగేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మార్వాడీ యువ మంచ్ సెక్రెటరీ కమలేష్ మాలి, జాయింట్ సెక్రెటరీ అరుణ్ బజాజ్, కమిటీ సభ్యులు లక్ష్మణ్ సింగ్, విజయ్ చౌదరి, అర్జున్ సిర్వి, వీర దేవాసి, సూరజ్ విశ్వకర్మ, యూనిఫార్మ్స్ స్పాన్సర్ మెన్స్ క్లబ్ ఫ్యాషన్స్ యజమాని పంకజ్ బజాజ్ మరియు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎయిమ్స్–ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఎయిమ్స్ బీబీనగర్ మధ్య సమర్థవంతమైన రిఫరల్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ, క్యాన్సర్ చికిత్స, హైరిస్క్ గర్భిణీల సేవలు, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై చర్చించారు. రోగుల సమన్వయం కోసం లైజన్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీఎంహెచ్‌వో డా. ఎం. మనోహర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కొండల్ రెడ్డి, డీసీహెచ్ఎస్ డా. సూర్యశ్రీ రావు, ఎయిమ్స్ ప్రొఫెసర్లు, వైద్యులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువత భవిష్యత్ సురక్షితం



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి:** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాధక ద్రవ్య నిషేధ దినోత్సవం సందర్భంగా అరోరా యూనివర్సిటీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత మాట్లాడుతూ డ్రగ్స్ వ్యసనం యువత జీవితాలను నాశనం చేస్తుందని, మాధక ద్రవ్య నేరాల్లో చిక్కుకుంటే చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని హెచ్చరించారు. ర్యాగింగ్, ఆసిడ్ దాడులు వంటి అనాగరిక చర్యలపై కూడా అవగాహన కల్పించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, భువనగిరి డీఎస్పీ బి. రవీందర్, జిల్లా మానసిక ఆరోగ్య ప్రాజెక్టు అధికారి డా. ప్రీతి స్వరూప్ డ్రగ్స్ దుష్పరిణామాలు, నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై లఘు చిత్రాలను ప్రదర్శించి, ఎక్సైజ్ శాఖ రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, భువనగిరి డీఎస్పీ బి. రవీందర్, డా. ప్రీతి స్వరూప్, ట్రైనీ ఈఎస్ వికాస్, ఎక్సైజ్ సీఐలు రాధ కిషన్, బాలోజీ నాయక్, డా. చంద్రశేఖర్, న్యాయవాదులు ఎస్. సాయి శ్రీనివాస్, బి. వెంకటేష్, జె. భాస్కర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అపరిశుభ్రతపై కలెక్టర్ అంకిత్ ఆగ్రహం

- వార్డెన్ కు మెమో జారీ
- ఆశ్రమ పాఠశాల పరిశుభ్రతలో నిర్లక్ష్యం సహించేది లేదు
- 24 గంటల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలి
- ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**



గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం అశ్వాపురం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన తొలుత పాఠశాలలు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గొందిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, పాఠశాల ఆవరణను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్లు దుమ్ము, ధూళితో అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం పాఠశాల సందర్శన సందర్భంగా ఇదే అంశంపై సూచనలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సక్రమంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయమై సంబంధిత సీటీవోతో ఫోన్‌లో మాట్లాడి కంప్యూటర్ ఇన్‌స్పెక్టర్ కాంట్రాక్టును రద్దు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుని గది, వంటశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించటానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదని గుర్తించి హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరారు. విద్యార్థుల సంఖ్య ఎంత ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాలను తనిఖీ చేసిన సందర్భంగా అక్కడ కూడా పరిశుభ్రత లోపాలను గమనించి ఆయన పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితో హెచ్ఎం గది మినహా పాఠశాలలోని అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత లోపించిందని అసంతృప్తిని వ్యక్తం చేశారు . పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు,



వంటశాల తదితర ప్రాంతాల్లో 24 గంటల్లో పూర్తిస్థాయిలో పరిశుభ్రత చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత లోపాలు, మెనూ అమలులో నిర్లక్ష్యంపై హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేయాలని ఆదేశించారు. కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యత, మెనూ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకుని, హాజరు నమోదును యాప్ ద్వారా పరిశీలించారు. విద్యార్థుల హాజరును ప్రతిరోజూ సక్రమంగా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పారిశుధ్య సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు . అనంతరం అశ్వాపురం మండలంలోని ఎలకలగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చేపడుతున్న సర్వే విధానం, దరఖాస్తుల పరిశీలన, యాప్ ద్వారా వివరాల నమోదు తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఎవ్వరికి అన్యాయం జరగకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించి సర్వే నిర్వహించాలని, అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా సర్వేకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యాప్‌లో నమోదు చేసే వివరాలు ఖచ్చితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నమోదైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ధృవీకరించాలన్నారు. సర్వే పురోగతికి సంబంధించిన పలు అంశాలను ఎంపీడీవో ముత్యాలరావు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అశ్వాపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మొత్తం 3,448 దరఖాస్తులు ఎల్ 1 స్థాయిలో ఉన్నాయని, వాటిలో 2,075 దరఖాస్తుల సర్వే పూర్తయిందని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 409 గుడిసెలను గుర్తించినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎకరానికి రూ.12 లక్షల పరిహారం



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి:** అడ్డ గూడూర్ మండలం రేపాక గ్రామ శివారులో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం భూసేక రణకు గురైన 10 మంది రైతులకు ఎకరానికి రూ.12 లక్షల చొప్పున పరిహారం చెక్కులను బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరానికి రూ.6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మరో రూ.6 లక్షలు అదనంగా మంజూరు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేసిన అధికారులకు, సహకరించిన ప్రజాప్రతినిధులకు, రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, తహసీల్దార్ ఎ. శేషగిరిరావు, డిప్యూటీ తహసీల్దార్ నరసింహారావు, నగేష్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, మాధవి, జీపీఓ రేపాక తదితరులు పాల్గొన్నారు.

# వివాహ, ఎంగేజ్‌మెంట్ వేడుకల్లో పాల్గొన్న యెల్లాల సంజీవరెడ్డి



**మోటకొండూరు, విశాలాభారతి:** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లాల సంజీవరెడ్డి వివిధ ప్రాంతాల్లో జరిగిన వివాహ, ఎంగేజ్‌మెంట్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మోటకొండూరు మండలంలోని మూత్తిరెడ్డిగూడెం గ్రామ AKR కన్వెన్షన్ హాల్‌లో చామపూర్ గ్రామానికి చెందిన పాస్టర్ ఎర్ర జాషువా కుమార్తె వివాహ వేడుకకు హాజరైన యెల్లాల సంజీవరెడ్డి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆత్మకూరు మండల కేంద్రంలోని YBR కన్వెన్షన్ హాల్‌లో చామపూర్ గ్రామానికి చెందిన వల్లాల ఉప్పలయ్య కుమార్తె ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఘట్కేసర్‌లోని నారాయణ గార్డెన్స్‌లో మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగపురం మల్లేష్ మేనకోడలు శాలిని వివాహ వేడుకలో పాల్గొని నూతన జంటకు తన ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో చామపూర్ గ్రామ సర్పంచ్ వాకిటి లింగారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వల్లాల నవీన్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాకిటి అనిల్ కుమార్ రెడ్డి, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చలో కొడంగల్ ఆవిర్భవ సభను విజయవంతం చేయండి



**విశాలభారతి, గూడూరు:** జులై 1న కొడంగల్ నియోజకవర్గంలో లంబడి హక్కుల పోరాట సమితి 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నాం. ఈ సభ యొక్క ముఖ్య ఉద్దేశం ఎన్నికల ముందు చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్ చేసినటువంటి దానిని తూచ తప్పకుండా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. మరియు తండాల గ్రామపంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని ఎస్టీ రిజర్వేషన్లను కేంద్రంలో చట్టబద్ధత చేయాలని భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్లో గోరుబోలి భాషను అమలు చేసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం ఏజెన్సీ ప్రాంతంలో 100శాతం ఏజెన్సీలో నివసిస్తునటువంటి గిరిజనులకు విద్య ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుండి వేలాది సంఖ్యలో లంబాడీలు హాజరుకావాలని సభను విజంతం చేయాలని పిలుపునిస్తున్నాం. ఈ కార్యక్రమంలో భూక్య సుందర్ నాయక్ భూక్య ప్రశాంత్ నాయక్ నునావత్ కిరియ నాయక్ నునావత్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అవార్డుల ప్రధానోత్సవం కాంగ్రెస్ నాయకుల హాజరు



**దేవరుప్పుల విశాలభారతి:** మహిళా సాధికారత మహిళల అభివృద్ధి కోసం విశేష సేవలు అందిస్తున్న మహిళలను సత్కరిస్తూ నిర్వహించిన సభ కార్యక్రమం హైదరాబాద్ లో ఈ కార్యక్రమానికి పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై మహిళల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, అభివృద్ధికి కృషి చేస్తున్న మహిళలను గౌరవించడం అభినందనీయమని, అన్నారు. మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, మహిళల అభివృద్ధి సమాజ ప్రగతికి పునాది అనే పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన మహిళలకను అభినందించి వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల అండాలు, నియోజకవర్గ మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేసిన నల్ల శ్రీరామ్



**దేవరుప్పుల విశాలభారతి:** టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి,పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం,అప్పిరెడ్డి పల్లి గ్రామ సీనియర్ నాయకుడు,మాజీ సర్పంచ్ పులిగిల్ల మల్లయ్య కుమారుడు గుండెపోటుతో మృతి చెందగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసి, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,బోనగిరి యాకన్న,బానోత్ రామచంద్రు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, నాయకులు మహ్మద్ జాకిర్,దావెర అనిల్, అప్పిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కౌడగాని అనుష, నర్సింగరావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూకట్ల కొమురయ్య,పులిగిల్ల అఖిల్,తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో కంప్యూటర్ ప్రారంభోత్సవం



**దేవరుప్పుల విశాలభారతి:** గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే లక్ష్యంతో ఇన్ఫోసిస్ సంస్థ బంజర ప్రాథమిక పాఠశాలకు అందజేసిన కంప్యూటర్ ను గ్రామ సర్పంచ్ ధరావత్ చిరంజీవి మండల విద్యాధికారి ఉప్పుగళ్ల శ్రీనివాస్ సంయుక్తంగా ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ ధరావత్ చిరంజీవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేయడంలో భాగంగా కంప్యూటర్ ను అందించిన ఇన్ఫోసిస్ ప్రాజెక్టు మేనేజర్ రాపాక స్వాతి సిఎస్ఆర్ కోఆర్డినేటర్ రాపాక నాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల విద్యాధికారి ఉప్పుగళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అత్యధిక కంప్యూటర్లు ఉన్న మండలంగా దేవరుప్పుల నిలిచిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు.

# అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

**ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి**

**చౌటుప్పల్, విశాలభారతి:**



మండల కేంద్రంలోని పీబీ గార్డెన్‌లో అఖిలపక్ష విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ , పల్లె మధు, దిండు భాస్కర్, నలపరాజు రమేష్, కట్టెల లింగస్వామి, బండిగారి శ్రీధర్ ,మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీ, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలు, విద్యాహక్కు చట్టం అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం వంటి అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం-2009ను ప్రైవేట్ విద్యాసంస్థలు తుంగలో తొక్కుతూ విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, రవాణా ఛార్జీలు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో ఇష్టారాజ్యంగా వేలాది రూపాయలు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. మండలంలో అనుమతులు లేకుండా కొన్ని పాఠశాలలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు, మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు లేకుండా పాఠశాలలను నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని అన్నారు. ఇలాంటి పాఠశాలలను గుర్తించి వెంటనే గుర్తింపు రద్దు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కల్పించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల అమలులో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అర్హులైన విద్యార్థులకు ఉచిత విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల అక్రమాలను అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, కొందరు అధికారులు యాజమాన్యాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని సమావేశం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యత నిర్ధారణ అయితే వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పై డిమాండ్లను అమలు చేయకపోతే విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, తల్లిదండ్రుల సంఘాలతో కలిసి మండల, జిల్లా స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సమావేశం హెచ్చరించింది.ఈ కార్యక్రమంలో ఒంటెద్దు లింగస్వామి,ఖయ్యూం,రాఘవ, ఇర్ఫాన్,పందుల శరత్,లింగస్వామి,గంగాదేవి శివ,అత్తు,చింటూ,మాజీ రెడ్డి సాయి,శ్యాంసుందర్, చిలువేరు సైదులు,శివ,పల్చం శివ,సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు ఇవ్వకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం



- **జీవో-46 వెంటనే రద్దు చేయాలి.. 19 వేల పోలీసు పోస్టులు భర్తీ చేయాలి**
- **దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగుల ఆందోళనకు బీజేపీ మద్దతు – కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి :**

ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, వెంటనే ఉద్యోగ నియామకాలపై స్పష్టత ఇవ్వకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని వారికి మద్దతు ప్రకటించిన ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాన్ని విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలను భర్తీ చేసిందో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పోలీసు నియామకాలకు సంబంధించి తీసుకొచ్చిన జీవో46 వల్ల వేలాది మంది అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 19 వేల పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయని డీజీపీ చెబుతున్నప్పటికీ ప్రభుత్వం కేవలం 5 వేల పోస్టుల భర్తీ గురించే మాట్లాడుతోందని విమర్శించారు. వెంటనే జీవో46ను రద్దు చేసి 19 వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది పోలీసు ఉద్యోగార్థులు, మరో 30 లక్షల మంది నిరుద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థులకు 35 సంవత్సరాల వరకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే కటాఫ్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. తెలంగాణ యువతనే నాన్‌లోకల్‌గా పరిగణించే పరిస్థితి ఎలా వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. జీవో46ను సవరిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలను శాసనసభలో బలంగా ప్రస్తావిస్తామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. నిరుద్యోగులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పుల్లారావు యాదవ్, అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, కొప్పుల నర్సింహ రెడ్డి, నిరుద్యోగుల జేఏసీ నాయకులు అనితా రెడ్డి, భూక్యా కుమార్, ఆకాశ్ గౌడ్, సంధ్య, నవీన్ పట్నాయక్, శింభు నాయక్, నవీన్ గౌడ్, ప్రత్యూష పాల్గొన్నారు.

# అనాజ్‌పూర్ అభివృద్ధికి మరో ముందడుగు



- **రూ.50 లక్షల హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**
- **ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హామీ**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి :**

అనాజ్‌పూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తామని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం అనాజ్‌పూర్ గ్రామంలో హెచ్ఎండీఏ నిధుల కింద రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాజ్‌పూర్ గ్రామానికి ఇప్పటికే నియోజకవర్గంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఇంకా ఇల్లు లేని అర్హులందరూ దరఖాస్తు చేసుకుంటే ప్రతి లబ్ధిదారునికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామం మధ్యలో మురుగునీటి కాలువ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామ పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే ఎంపీడీఓను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అనాజ్‌పూర్ గ్రామానికి రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తామని, అవసరమైన నిధులను కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో అనాజ్‌పూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాచపాక నవనీత మహేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి, పంచాయతీ సభ్యులు కావలి వెంకటేష్, గువ్వల భరత్, ఏర్పుల సంధ్య బాలరాజ్, గుజ్జ రాంరెడ్డి, ఇంజమూరి కవిత మహేందర్, చిలుక యాదిరెడ్డి, ఏర్కలి బాలకృష్ణ గౌడ్, ఎల్కపల్లి సింధు మహేష్, రాగని అరవింద్, పంచాయతీరాజ్ డీఈ ఇంద్రసేన రెడ్డి, ఎంపీడీఓ స్రవంతి, ఏఈ సూర్యతేజ, గ్రామ కార్యదర్శి సూరిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాధర్మ విజయవంతం చేయాలి

**ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు జోగు అనిల్**



**దేవరుప్పుల విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచుల హక్కుల సాధన కోసం ఈనెల 25న హైదరాబాద్ లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహా ధర్నాకు విజయవంతం చేయాలని, కోరుతూ దేవరుప్పుల మండల కేంద్రంలో బుధవారం మండల ఉపసర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు జోగు అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపసర్పంచుల, వార్డు సభ్యులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు గౌరవం లభించడం లేదన్నారు. ఉపంచులకు నెలకు కనీసం రూ" 5000 గౌరవ వేతనం వార్డు సభ్యులకు రూ" 3000 గౌరవ వేతనం అందించాలని, డిమాండ్ చేశారు. అలాగే ఉపసర్పంచ్ ల అధికారాలు చెక్ పవర్ హక్కులను యధావిధిగా కొనసాగించాలని, ప్రభుత్వాన్ని కోరారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నామని, మండలంలోని ఉపసర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు ఫోరం నాయకులు భానోత్ భాస్కర్, పులి పంపుల భాస్కర్, మెరుగు రమేష్, భానోత్ హరి, అజ్మీర బాలు, నక్క రేణుక, చంద్రగిరి సంపత్ తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**మరిపెడ, విశాలభారతి:** ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవి పిలుపునిచ్చారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మరిపెడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ విశారపు ప్రగతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ విశారపు ప్రగతి మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, కౌన్సిలర్లు గౌతమ్ రెడ్డి, సురేష్, రాము, హెల్త్ సూపర్వైజర్ మంగమ్మ, ఆచార్యులు, లలిత కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులు ప్రజాసేవలో బాధ్యతగా వ్యవహరించాలి




**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు మూడో రోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీవో సోమ్లాల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పారిశుద్ధ్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం ట్రైనర్లు రామోజీ, ప్రణయ్, వెంకన్న గ్రామపంచాయతీ చట్టాలు, వార్డు సభ్యుల విధులు, స్థానిక సంస్థల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలుపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు అరుణ్ జ్యోతి, రామకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, ఆపరేటర్లు ఉమా, ఉమేష్‌తో పాటు ఆయా గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# చిరునవ్వే కాంగ్రెస్ ప్రభుత్వ విజయానికి నిజమైన నిదర్శనం

**నాచారం, విశాలభారతి:** మల్లాపూర్లో, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, సంక్షేమం, ఆర్థిక ఆర్థిక సాధికారత సా లక్ష్యంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మల్లాపూర్ డివిజన్లో ఘనంగా నిర్వహించబడింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.



# ఇబ్రహీంపట్నం అభివృద్ధిపై మల్ రెడ్డి గర్జన





- **రూ.700 కోట్లతో రోడ్ల విప్లవం.. అభివృద్ధిని అడ్డుకునే వారిని ప్రజలే తిరస్కరించాలి**
- **బాటసింగారం రైతు గోదాముకు శంకుస్థాపన – రైతు సంక్షేమం, సంక్షేమ పాలన, ఎస్ఐఆర్‌పై అప్రమత్తతకు ఎమ్మెల్యే పిలుపు**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఇతర నియోజకవర్గాలు అసూయపడే స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్న ఆయన, అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేసే వారిని ప్రజలే తిరస్కరించాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం నూతన గోదాముకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేశారు.

**రూ.700 కోట్లతో రోడ్ల విప్లవం.. గ్రామాల రూపురేఖలే మారుస్తాం..**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి నాణ్యమైన రహదారులు, మౌలిక వసతులు కల్పించేందుకు కేవలం రోడ్ల నిర్మాణానికే రూ.700 కోట్ల నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి ప్రతి ఇంటి గడపకు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**రైతుల కోసం మెగా మార్కెట్.. 20 వేల మందికి ఉపాధి**

కోహెడలో దేశంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు కానుందని, అది పూర్తయితే 20 వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల పంటలకు మెరుగైన ధరలు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**15 ఏళ్లు ఏం చేయలేదు.. ఇప్పుడు అభివృద్ధిపై విమర్శలా?**

గత 15 సంవత్సరాలుగా నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేసిన వారే ఇప్పుడు అభివృద్ధిని చూసి తట్టుకోలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విమర్శించారు. దోపిడీ రాజకీయాలు చేసే వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, అభివృద్ధిని అడ్డుకునే శక్తులను గ్రామాల నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు.. కాంగ్రెస్‌దే ప్రజల నమ్మకం**

బీఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీగా ప్రజల మద్దతుతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా**

ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రాయితీ గ్యాస్, రైతు భరోసా, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

**ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి**

ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఓటును కాపాడటం పార్టీ శ్రేణుల బాధ్యత అని పేర్కొన్నారు.

**ప్రజల నమ్మకమే నా బలం**

ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తన ధ్యేయమని, అందుకే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్మెట్ ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూధన్ రెడ్డి, అబ్దుల్లాపూర్మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవదాస్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుల విజయ శ్రీశైలం గౌడ్, నువ్వే ఛైర్మన్ భాస్కర చారి, మాజీ సర్పంచ్ మూల మహేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుకు వ్యతిరేకంగా ధర్నా

- **ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బాధితుల ఆందోళన.. ఆర్. కృష్ణయ్య మద్దతు**
- **ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి**
- **మార్కెట్ యార్డును వేరే చోట ఏర్పాటు చేయాలని డిమాండ్**




**మొయినాబాద్ , విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో పేదలకు గతంలో కేటాయించిన 60 గజాల ఇళ్ల స్థలాల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ.. గ్రామస్థులు బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఆందోళన నిర్వహించారు. శాంతి యువజన సంఘం, అంబేద్కర్ యువజన సంఘం, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ మైనార్టీ యువజన సంఘం, సేవాలాల్ యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని, మార్కెట్ యార్డు ఏర్పాటును నిలిపివేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యం చేసుకుని హిమాయత్‌నగర్ గ్రామస్థులకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ భాస్కర్ పేదలకు కేటాయించిన భూములను కాపాడాలని, ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముదిగొండ రవి యాదవ్, సలీంఖాన్, మాల స్వామి, యువజన సంఘాల అధ్యక్షులు కుమ్మరి విఠల్, కట్టమీది శ్రీను, కరీం, గోపాల్ నాయక్, అశోక్ చారి, షాబాద్ ప్రవీణ్, సందీప్, కావాలి చంద్రయ్య, ఆల్కపురం నందీశ్వర్ రెడ్డి, కాళిదాసు చారి, అఖిల్, కొమ్ము శ్రీకాంత్, రెడ్డిపల్లి సుమన్ తోపాటు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఆడ బిడ్డ వివాహానికి ఆర్థిక సాయం అందిస్తా

- **కౌన్సిలర్ మద్యపాగు మహేష్**



**మొయినాబాద్ , విశాలభారతి:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం చేస్తానని కౌన్సిలర్ మద్యపాగు మహేష్ అన్నారు. బుధవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన న్యాలాటి బాలయ్య ఇందిరమ్మ దంపతుల కుమార్తె మమత వివాహానికి హాజరైన కౌన్సిలర్ మద్యపాగు మహేష్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే గ్రామానికి చెందిన కనగల్ల విజయ్ కుమార్ పద్మావతి దంపతులకు చెందిన కుమార్తె కస్తూరీ వివాహానికి హాజరై ఆశీర్వదించారు. అనంతరం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ కళ్యాణ కానుక పథకం ద్వారా తన వంతు బాధ్యతగా రూ.25 వేల రెండు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మద్యపాగు మహేష్ మాట్లాడుతూ.. ఆడబిడ్డ కళ్యాణ కానుక పథకం ద్వారా వార్డులోని అర్హులైన ప్రతి ఆడబిడ్డ పెళ్లికి పెద్దన్నగా వారికి అండగా ఉంటూ ఆర్థిక సాయం చేస్తానన్నారు. ఆడ బిడ్డల వివాహానికి ఆర్థిక సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. వార్డులో మౌలిక వసతులు కల్పించి వార్డును మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. వార్డు అభివృద్ధికి కౌన్సిలర్ మద్యపాగు మహేష్ చేస్తున్న కృషికి వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి దేవత విగ్రహ ప్రతిష్టాపనతో పాటు బొడ్రాయి, నాభిశిలా ప్రతిష్టా మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తులతో కలిసి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలుగా నిలుస్తాయని, భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మహోత్సవంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సికిందర్‌గూడ భూ వివాదం ముదురుతోంది




- **తనపై కుట్రపూరిత దుష్ప్రచారం: నాగుల నరేందర్ ఫైర్**
- **ప్లాట్లు తనవేనన్న బిల్డర్ ప్రచారం అబద్ధం**
- **డబుల్ రిజిస్ట్రేషన్‌పై అనుమానాల మేఘాలు**
- **ఎఫ్ఐఆర్‌కు 40 రోజులు దర్యాప్తు ఎందుకు నిశ్శబ్దం?**
- **పోలీసుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు**

**రాజేంద్రనగర్, విశాల భారతి:**

సికిందర్‌గూడలో కొనసాగుతున్న భూ వివాదం మరింత ఉత్కంఠకు దారితీసింది. తనపై జరుగుతున్న ప్రచారం వెనుక కుట్ర దాగి ఉందని మాజీ వార్డ్ సభ్యుడు నాగుల నరేందర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్లాట్ నంబర్లు 40, 41 తనవేనంటూ బిల్డర్ రాజశేఖర్ రెడ్డి చేస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. బండ్లగూడ జాగీర్ అభ్యుదయ నగర్ కమిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన నరేందర్, కొందరు వ్యక్తులు తప్పుడు సమాచారం ఆధారంగా తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఎంత చేసినా వాస్తవాలు బయటపడతాయని పేర్కొన్నారు. తాను 2026లో ప్రకాశ్ గౌడ్ కుటుంబ సభ్యుల నుంచి 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి, అదే సంవత్సరం ఫిబ్రవరి 27న అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. అయితే అదే స్థలానికి మరొకరికి కూడా రిజిస్ట్రేషన్ జరగడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భూ వివాదానికి సంబంధించి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించినప్పటికీ 40 రోజులుగా దర్యాప్తు ముందుకు సాగకపోవడం బాధాకరమని తెలిపారు. డీసీపీ, పోలీస్ కమిషనర్, హోం సెక్రటరీ దృష్టికి విషయం తీసుకెళ్లినా స్పందన రాకపోవడం ఆశ్చర్యకరమన్నారు. కేసు నమోదైన తర్వాత కూడా ఇప్పటివరకు ఎవరినీ విచారణకు పిలవకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా సరైన వివరాలు అందుబాటులో లేవని చెప్పారు. కొందరు వ్యక్తులకు అధికారులు సహకరిస్తున్నారనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని వ్యాఖ్యానించారు. ప్లాట్ నంబర్లు 40, 41కు సంబంధించిన అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, న్యాయపరంగా తాను బలమైన స్థితిలో ఉన్నానని నరేందర్ తెలిపారు. కోర్టు ఇచ్చే తీర్పును గౌరవిస్తానని స్పష్టం చేశారు. సికిందర్‌గూడ సర్వే నంబర్ 1లో జరుగుతున్న అక్రమాలను ప్రజల ముందుకు తీసుకురావడానికి బండ్లగూడ చౌరస్తాలో ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేసి పూర్తి వివరాలను ప్రదర్శిస్తానని ఆయన ప్రకటించారు. సమావేశంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్–44 పై ఘోర ప్రమాదం



- **స్కూటీ దారుణ ఢీకొట్టు, వ్యక్తి మృతి**
- **తొండుపల్లి వద్ద హిట్ అండ్ రన్.. డీసీఎం ఢీకొట్టి పరారీ**

**రాజేంద్రనగర్, విశాలభారతి:** ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై తొండుపల్లి రైల్వే బ్రిడ్జ్ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్ జుల్ఫకర్ అలీ (55), వృత్తిరీత్యా మెటీరియల్ సరఫరాదారు, పని నిమిత్తం తన స్వగ్రామమైన వీరాపూర్‌కు వెళ్లి, అక్కడి పనులు ముగించుకుని బుధవారం మధ్యాహ్నం తిరిగి తన ఇంటికి బయలుదేరాడు. సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో తొండుపల్లి రైల్వే బ్రిడ్జ్ వద్దకు చేరుకోగానే, వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం అతని స్కూటీను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జుల్ఫకర్ అలీ రోడ్డుపై పడిపోయి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి కుమారుడు మహ్మద్ ఉమర్ ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

## ఇచ్చుకో.. షెడ్డు కట్టుకో..! పైసలు ఇస్తే ఏమైనా కట్టుకోవచ్చా..?



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, నిబంధనలను ఉల్లంఘించిన వారికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారిలో, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలోనే ఓ భారీ షెడ్డు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో సంచరించే టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి ఈ నిర్మాణం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, సంబంధిత నిర్మాణదారుడు టౌన్ ప్లానింగ్ సిబ్బందిలో విశ్వమోహన్ అనే ఉద్యోగికి అత్యంత సన్నిహితుడని, అందుకే అక్రమ నిర్మాణంపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "పైసలు ఇస్తే ఏమైనా కట్టుకోవచ్చు" అన్నట్టుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుతో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు కూడా మౌనం పాటించడం విమర్శలకు దారితీస్తోంది. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోనే అక్రమ నిర్మాణం జరుగుతుంటే చర్యలు లేకపోవడం టౌన్ ప్లానింగ్ శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అక్రమ నిర్మాణంపై వెంటనే విచారణ జరిపి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ శాఖలో అక్రమాలకు అండగా నిలుస్తున్న అధికారులపై కూడా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## ఆస్తికోసం తండ్రిపైనే కుమారుడి దాడి

- **"ఆస్తి రాయకపోతే చంపేస్తా" – తండ్రిని చితకబాదిన కుమారుడు**



**రాజేంద్రనగర్, విశాల భారతి:** ఆస్తి వివాదం నేపథ్యంలో కన్నతండ్రిపైనే కుమారుడు దాడి చేసిన ఘటన నగర శివారులోని ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు, గ్రామానికి చెందిన వృద్ధుడు అనంత రేడ్డి తనకు ఉన్న 31 గుంటల భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచిపెట్టాడు. అయితే తన వృద్ధాప్య అవసరాల కోసం 300 గజాల స్థలాన్ని తన పేరిట ఉంచుకున్నాడు. ఈ స్థలాన్ని కూడా తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలని చిన్న కుమారుడు ఓం రెడ్డి కొంతకాలంగా ఒత్తిడి తెస్తున్నాడు. తండ్రి నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన అతడు, వృద్ధుడని కూడా చూడకుండా దాడికి పాల్పడ్డాడు. అంతేకాక, ఆస్తి రాసివ్వకపోతే చంపేస్తానని బెదిరించినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడు అనంత రేడ్డి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఘటనపై విచారణ కొనసాగుతోంది.

## లింగంపల్లి కూరగాయల మార్కెట్ వద్ద గుర్తుతెలియని మృతదేహం

**సైబరాబాద్ విశాల భారతి:** లింగంపల్లి కూరగాయల మార్కెట్ సమీపంలో సోమవారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు.మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు పసుపు, నీలం రంగు చారలు గల చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పరిశీలించగా తల భాగంలో గాయాలు కనిపించాయి.సంఘటనా స్థలానికి చేరుకున్న చందానగర్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. ప్రాథమిక విచారణలో మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సకాలంలో ఆహారం, వైద్యం అందక మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే తలపై గాయాలు ఉండడంతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# అబ్దుల్లాపూర్‌మెట్‌లో అభివృద్ధి పరుగులు





- **నాలుగు గ్రామాల్లో రూ.1.40 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**
- **కవాడిపల్లి నుంచి గండిచెరువు వరకు సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో గ్రామీణాభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామాల మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయని ఆయన పేర్కొన్నారు.

**కవాడిపల్లిలో సీసీ రోడ్డుకు ప్రారంభం**

మండల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే తొలుత కవాడిపల్లి గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం కలుగుతుందని తెలిపారు.

**లష్కర్‌గూడలో మరో అభివృద్ధి అడుగు**

అనంతరం లష్కర్‌గూడ గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధిలో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

**అనాజ్‌పూర్‌లో రూ.50 లక్షల పనులకు శంకుస్థాపన**

అనాజ్‌పూర్ గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు.

**గండిచెరువులో రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం**

తదుపరి గండిచెరువు గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, రూ.15 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ పనులతో గ్రామంలో పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయని తెలిపారు.

**ప్రతి గ్రామం అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు తదితర అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల సహకారంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, కవాడి పల్లి గ్రామ సర్పంచ్ కొలన్ లక్ష్మి ప్రసన్న రవీందర్ రెడ్డి, లష్కర్ గూడ గ్రామ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్, అనాజ్ పూర్ గ్రామ సర్పంచ్ నవనీత మహేష్, వైస్ ఛైర్మన్ భాస్కర చారి , మండల అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్, మాజీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్,మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, ఉపసర్పంచ్ రాసాల రాము యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



# దక్షిణాదిలో ఆ స్వేచ్ఛ లేదు

దక్షిణాది సినీరంగంపై అగ్ర కథానాయిక తమన్నా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది సినిమాల్లో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుందని, కథానాయికల్ని గ్లామరస్‌గా చూపించడానికే అధిక ప్రాధాన్యతనిస్తారని తమన్నా వ్యాఖ్యానించింది. 'హిందీ చిత్రసీమలో రెండు రకాల నటులుంటారు. కొందరు అభినయప్రధాన పాత్రల్ని ఎంచుకొని కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటారు. మరికొందరేమో కేవలం గ్లామర్‌కే పరిమితమవుతారు. బాలీవుడ్‌లో ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. కానీ దక్షిణాదిలో మాత్రం నటన, గ్లామర్‌ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది' అని తమన్నా పేర్కొన్నది. ఆమె మాటలపై దక్షిణాది అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తెలుగు, తమిళం ద్వారానే స్టార్‌డమ్‌ను సంపాదించుకొని విశ్వాసం లేకుండా ఇలాంటి మాటలు మాట్లాడటం తగదని నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

- రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



**చౌటుప్పల్ విశాలభారతి:** గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. మండలం ధర్మోజిగూడెం గ్రామంలో ఉపాధి హామీ (ఎన్‌ఆర్ఇజిఎస్) నిధులు రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం వారు ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రాధాన్యత క్రమంలో అంచెలంచెలుగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తూ, సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే సొంతం. ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, దశాబ్ద కాలంగా ఆగిపోయిన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందజేయడంతో పాటు నిర్విరామంగా రేషన్ కార్డుల ప్రక్రియ చేపట్టడం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమని వారు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలు విజయవంతంగా అందుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పకీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, సామిడి సంధ్య, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, జంగం వెంకటమ్మ, మాజీ ఉప సర్పంచ్‌లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, బద్రి లింగయ్య, ఐతరాజు సత్తయ్య, రాచకొండ కృష్ణయ్య, సామిడి లింగారెడ్డి, ఊదరి లింగయ్య, రాచకొండ వెంకటేశం, ఊదరి స్వామి, గునుగంటి స్వామి, చెన్నోజు భూషణాచారి, బోనకుర్తి హరికృష్ణ, ఊదరి రవి, జంగం అంజయ్య, ఐతరాజు రవీందర్, బత్తుల సింహాచలం, కొంతం శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, కాలనీ వాసులు, గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐపిఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు



**చౌటుప్పల్ విశాల భారతి:** మండలంలోని తూప్రాన్‌పేట్ గ్రామ పరిధిలోని నేతాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (ఎన్ఐపీఎస్) తన విద్యార్థులకు ఉత్తమ ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ప్రముఖ ఫార్మసీ విద్యాసంస్థగా తన ప్రత్యేకతను కొనసాగిస్తోంది. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు, ఆప్టిట్యూడ్ శిక్షణ, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాల శిక్షణ, పరిశ్రమల నిపుణులతో పరస్పర చర్చలు వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోంది. ఎన్ఐపీఎస్ విద్యార్థులు ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు, ఆరోగ్య సేవా సంస్థలు, రిటైల్ ఫార్మసీ చైన్‌లు, క్లినికల్ రీసెర్చ్ సంస్థలు, క్వాలిటీ అష్యూరెన్స్ మరియు క్వాలిటీ కంట్రోల్ విభాగాలలో ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇంటర్న్‌షిప్‌లు, ఇండస్ట్రియల్ విజిట్లు, నిపుణుల ఉపన్యాసాలు మరియు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కళాశాల నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులు సాధిస్తున్న విజయాలపై హర్షం వ్యక్తం చేస్తూ, పరిశ్రమలతో మరింత బలమైన అనుబంధాలను ఏర్పరచి ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. విద్యార్థులు ఔషధ మరియు ఆరోగ్య రంగాలలో విజయవంతమైన వృత్తి జీవితాన్ని నిర్మించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు మరియు వృత్తిపరమైన అనుభవాన్ని అందించడం తమ లక్ష్యమని పేర్కొంది. 2007లో స్థాపించబడిన ఎన్ఐపీఎస్, జేఎన్‌టీయూహెచ్‌కు అనుబంధంగా ఉండి, ఏఐసీటీఈ మరియు పీసీఐ అనుమతులతో బి.ఫార్మసీ మరియు ఎం.ఫార్మసీ (ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మకాలజీ) కోర్సులను అందిస్తోంది. విద్యా నాణ్యత, పరిశోధన మరియు విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. 13 విద్యార్థులు అపోలో ఫార్మసీ సంస్థలో ఉద్యోగాలు సాధించిన విజయాలకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించింది. సమాజానికి మరియు ఆరోగ్య రంగానికి సేవలందించే నైపుణ్యవంతులైన ఫార్మసీ నిపుణులను తయారు చేయడంలో ఎన్ఐపీఎస్ తన కృషిని కొనసాగిస్తుందని యాజమాన్యం, అనసూయ మరియు దానయ్య ఈ సందర్భంగా ఒక ప్రకటనను పేర్కొన్నారు.

## విపత్కర పరిస్థితుల్లో డిడిఆర్ఎఫ్ సేవలు ప్రజలకు అవసరం

- డిడిఆర్ఎఫ్ బృందాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి
- డిడిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల శిక్షణను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :** అశ్వాపురం మండలంలోని తుమ్మల చెరువు వద్ద జరుగుతున్న డిడిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు. శిబిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి అందుతున్న శిక్షణ తీరును పర్యవేక్షించారు. విపత్తుల సమయంలో ప్రజలను రక్షించడంలో, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో డిడిఆర్ఎఫ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శిక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాబోయే వర్షాల దృష్ట్యా సంభవించే వరదలలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న భాదితులను రక్షించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డీడిఆర్ఎఫ్ బృందాలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ అన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా అన్ని శాఖలతో సమన్వయం పాటిస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణను పొందిన డిడిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ముఖ్యంగా గోదావరి నది వరదలు సంభవించినప్పుడు నదీ పరివాహక ప్రాంతాలలో నివసించే లోతట్టు ప్రాంత ప్రజలను సంరక్షించడానికి ఈ బృందాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. రెస్క్యూ సమయంలో అవసరమయ్యే లైవ్ జాకెట్స్, లైఫ్ బాయ్ రింగ్స్, బోట్లు, రోప్స్ మరియు ఇతర సామాగ్రి మొత్తాన్ని శిక్షణ పొందుతున్న బృందాలకు సమకూర్చడం జరిగిందని తెలియజేశారు. విపత్కర సమయాల్లో డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను వినియోగించుకోవాలని తెలియజేసారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, అశ్వాపురం సిఐ ఎల్లయ్య, ఆపరేషన్ ఆర్ఐ బి. రవి, ఎస్ఐ రాజేష్, పోలీస్ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు, డిడిఆర్ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.